నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 24 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

పచ్చని కాపురాల్లో వివాహేతర చిచ్చు

- పతుల ఆయుష్షు తీస్తున్న సతులు
- చిచ్చురేపుతున్న కొత్త పరిచయాలు
- కపుల్స్ మధ్య థర్డ్‌మెన్ రాకతో హత్యలు
- హనీమూన్ అంటేనే కొత్త జంటల్లో భయం
- తాజాగా గద్వాలకు చెందిన తేజేశ్వర్ హత్యకూ అత్త, భార్య, ఆమె ప్రియుడే కారణం

వివాహేతర సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు రాజేస్తున్నాయి. కొత్త వ్యక్తుల పరిచయాలు కపుల్స్ మధ్య వివాదాలకు కారణమవుతున్నాయి. తమ బంధానికి అడ్డొస్తున్నారని పతుల ఆయుష్షును తీసేందుకు సైతం సతులు వెనుకాడడం లేదు. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. మొన్న మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ మరిచిపోక ముందే తాజాగా గద్వాల జిల్లాలో అదే తరహాలో మరో ఘటన చోటు చేసుకున్నది. అత్త, భార్య, ఆమె ప్రియుడు కలిసి భర్తను హత్య చేసిన సంఘటన తీవ్ర సంచలనం రేకెత్తిస్తున్నది. హత్యకు కారణమైన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పోలీసు అదుపులో ముగ్గురు?



తేజేశ్వర్, ఐశ్వర్య పెళ్లి నాటి ఫొటో

గద్వాల, జూన్ 23 : ఇటీవల మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ తరహా ఘటన గద్వాలలో వెలుగు చూసింది. సోనమ్ రఘువంశీ ఘటన తర్వాత కొత్తగా పెళ్లయిన వారిలో హనీమూన్‌పై భయాందోళనలు నెలకొన్నాయి. ఈ తరహా ఘటన జోగుళాంబ గద్వాలలో వెలుగు చూసింది. తల్లి తోపాటు బిడ్డతో కూడా బ్యాంక్ ఉద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. చివరికి వారి సాయంతో.. ఆ ఉద్యోగి ప్రోత్సాహంతో మహిళ భర్తనే హత్య చేయించింది. ప్రస్తుత సమాజంలో సతుల వివాహేతర సంబంధాల కారణంగా పతులు బలి కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. గద్వాల పట్టణం గంట గేరికి చెందిన తేజేశ్వర్(32) కర్నూల్ జిల్లా కల్లూరు ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ఐశ్వర్యను గత నెల 18వ తేదీన బీచుపల్లి ఆంజనేయస్వామి గుడిలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇది అబ్బాయి కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో అమ్మాయి కుటుంబ సభ్యులు మాత్రమే పెళ్లికి వెళ్లారు. పెళ్లైన తర్వాత ఇద్దరు గద్వాలలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి ఇంట్లో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. తేజేశ్వర్ వివాహం వారి కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో రోజు కలహాలు జరుగుతుండగా ఐశ్వర్య మాత్రం ఇక్కడ భర్తతో ఉంటూనే అక్కడ ప్రియుడితో ఫోన్‌లో చాటింగ్ చేస్తూ ప్రేమాయణం కొనసాగించింది.

హత్యకు దారి తీసిన కారణాలు..

ఐశ్వర్యకు తండ్రిలేడు. తల్లి సుజాత మాత్రమే ఉన్నది. తల్లి కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఆ క్రమంలోనే ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేసే మేనేజర్ తిరుమల్‌రావుతో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. తల్లితో సహజీవనం చేస్తూనే బ్యాంక్ మేనేజర్ కూతురితో రాసలీలలు మొదలుపెట్టాడు. అయితే బ్యాంక్ మేనేజర్‌కు పిల్లలు కాకపోవడంతో ఐశ్వర్యను పెళ్లి చేసుకోవాలని ప్రయత్నించాడు. అయితే దీనికి బ్యాంక్ మేనేజర్ భార్య అంగీకరించకపోవడంతో పెళ్లి తంతు విరమించుకున్నాడు. ఈ క్రమంలోనే తేజేశ్వర్‌తో పరిచయం పెంచుకున్న ఐశ్వర్య, గతంలో నాకు పెండ్లి కుదిరిందని ఫిబ్రవరిలో పెండ్లి జరగాల్సి ఉండగా మా అమ్మ కట్నం ఇచ్చుకోలేక పెళ్లి ఆగిపోయిందని, తనకు ఎవరితో ఎఫైర్ లేదని నమ్మించి తేజేశ్వర్‌తో ప్రేమాయణం కొనసాగించింది. నీవంటే నాకు ఇష్టం అని మాయమాటలు చెప్పి తేజేశ్వర్‌ను నమ్మించి ఐశ్వర్య వివాహమాడింది. తేజేశ్వర్‌తో వివాహం అయినప్పటికీ బ్యాంక్ మేనేజర్ తిరుమలరావుతో ఐశ్వర్య చాటింగ్‌లు, ఫోన్‌కాల్స్ కొనసాగిస్తూనే ఉన్నది. అనుమానం వచ్చి అత్తమామలు ఫోన్లు ఎక్కువగా మాట్లాడుతున్నావ్ అని ప్రశ్నించగా మా అమ్మతో మాట్లాడుతున్నాని అబద్ధాలు చెప్పి ప్రియుడితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. అయితే ప్రియుడిపై ఉన్న మోజుతో భర్తను హత్య చేయించాలని భావించి తల్లి, బ్యాంక్ మేనేజర్‌తో మంతనాలు జరిపినట్లు సమాచారం. నెల రోజులలోనే తేజేశ్వర్‌ను హత్య చేయించడానికి నాలుగు సార్లు ప్రయత్నించింది. ఐదో ప్రయత్నంలో కర్నూల్‌కు చెందిన ముగ్గురికి సుఫారీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 17న గుర్తు తెలియని నెంబర్ నుంచి తేజేశ్వర్‌కు తమకు పొలం కావాలని దానిని సర్వే చేయాలని, పొలం కొనుగోలు చేస్తే మంచి కమీషన్ ఇస్తామని ఫోన్ చేశారు. స్వతహాగా సర్వేయర్ అయిన తేజేశ్వర్ వారి మాటలు నమ్మి వారు తెచ్చిన కారులో బయలు దేరాడు. తేజేశ్వర్‌ను కారులో ఎక్కించుకొని గద్వాల మండలం పూడూరు, అనంతపురం, ఎర్రవల్లి, ఇటిక్యాల మండలం రావుల చెర్వు, పెబ్బేర్, తుంగభద్రనది వైపు కారును తిప్పుతూ చివరికి గద్వాల మండలం పూడూరు–రావుల చెర్వు మధ్య కారులోనే హత్య చేసి కర్నూల్ జిల్లా పాణ్యం సమీపంలోని సుగాలమెట్టు ప్రాంతంలో పిన్నాపురం చెరువులో మృతదేహాన్ని పడవేశారు. పోలీసులు కాల్ డాటా తీయగా ఐశ్వర్య తన మాజీ ప్రియుడు తిరుమలరావుకు సుమారు రెండు వేల సార్లు ఫోన్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు తేజేశ్వర్ డెడ్‌బాడీని గుర్తించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో నిందితులు

హత్యచేసిన వారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్య చేసిన వారిని గద్వాల సీఐతోపాటు గట్టు, గద్వాల, పట్టణ, గద్వాల రూరల్ ఎస్సైలు వెంట బెట్టుకొని సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. హత్యలో పాల్గొన్న కర్నూల్‌కు చెందిన ముగ్గురి తోపాటు వారికి సహకరించిన గద్వాలకు చెందిన వ్యక్తితోపాటు తేజేశ్వర్ భార్య ఐశ్వర, అత్త సుజాతను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా అక్రమ సంబంధాల మోజులో పడి మహిళలు ఏమి చేస్తున్నారో వారికే తెలియకుండా తమ నిండు నూరేళ్ల జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. సమాజంలో పరువు పోగొట్టుకుంటున్నారు.

మదనాపురం మండలం దంతనూరులో నాలుగు నెలలైనా పునాది బిల్లు అందని ఇంటి నిర్మాణం

పై ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బాలమణి. మదనాపురం మండలం దంతనూరు గ్రామం. ఈమె నాలుగు నెలల కింద ఇందిరమ్మ ఇల్లు పునాది నిర్మించుకున్నది. కచ్చితంగా ఇల్లు కట్టుకోవాలన్న లక్ష్యంతో ఉండడంతో అన్నింటినీ సిద్ధం చేసుకున్నది. వీరి కుటుంబంలో మొత్తం 8మంది రెండు రేకుల షెడ్లలో ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుందామని ఆశపడితే, ఎప్పుడడిగినా బిల్లు వస్తుందని చెబుతున్నారు తప్పా ఇవ్వడం లేదు. కట్టుకుంటే తక్షణమే బిల్లు ఇస్తామని చెబుతున్న అధికారులకు ఈ బాలమణి ఇంటి నిర్మాణం ఎందుకు కనిపించడం లేదో వారికే తెలియాలి.

పైలేట్!

- వనపర్తి జిల్లాలో ముందుకురాని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు
- 40 శాతం కూడా దాటని మార్కవుట్లు
- ఇందిరమ్మ ఇండ్లపై నిరాశ.. నిస్పృహలు
- మాకొద్దని పత్రాలు రాసిచ్చిన 80 మంది మదనాపూర్ మండలం దంతనూర్ లబ్ధిదారులు
- ఐదు నెలలవుతున్నా పడని అడుగులు

వనపర్తి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : దంతనూరు పైలట్ ప్రాజెక్టు గ్రామంలో 61మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే, కేవలం ఇప్పటి వరకు 15మంది మాత్రమే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసుకున్నారు. వీరిలో మరో 10మంది తమకు ఇల్లు వద్దని గ్రామ కార్యదర్శికి పత్రాలు రాసిచ్చారు. మార్కవుట్ ఇచ్చినా నాలుగు నెలలుగా 9మంది ముందుకు రావడం లేదు. ఇంకాను 27మంది ఎటు పోవాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. అధికారులు వెంట పడిన కదలడం లేదంటే, వీరు కూడా వెనకిబాట పట్టిన ట్లూ అంచనా వేస్తున్నారు. ఇది పైలట్ ప్రాజెక్టులోని ఒక గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సమాచారం ఇది.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. ఇందుకు గత జనవరి 26ను ముహూర్తంగా నిర్ణయించి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే.. ప్రచారం జరిగినంత వేగంగా పథకం ముందుకు వెళ్లడం లేదు. ఎన్నో ఆశలతో మొదలు పెట్టిన ఈ ఇండ్ల ప్రాజెక్టు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లు జిల్లాలో కొనసాగుతుంది. మంజూరైన వాటిలో కనీసం సగం వరకైనా ముందుకు సాగకపోవడంతో లోపం ఎక్కడుందీ అన్న అనేక ప్రశ్నలు మొదలవుతున్నాయి. జిల్లాలో ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపిక చేశారు. జిల్లాలోని 15మండలాల్లో 15గ్రామాలు ఈ లెక్కన గుర్తింపులోకి వచ్చాయి. ప్రారంభంలో ఇబ్బడి ముబ్బడిగా ఇండ్ల నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. తీరా చివరి దశకు వచ్చే సగానికి సగం దరఖాస్తుదారులు కూడా నిర్మాణాలకు ముందుకు రాలేదు. నిబంధనలకు సరిపోని కొన్ని దరఖాస్తులను అధికారులు కూడా తొలగించారు. దీంతో చాలా వరకు ఇండ్ల నిర్మాణాలు చేసుకునే వారి సంఖ్య తగ్గిపోయింది. ఇలా జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొదటి దశలో 1209 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

40శాతం దాటని మార్కవుట్లు..

పైలట్ ప్రాజెక్టు కింద మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు 40శాతం కూడా మార్కవుట్లు దాటలేదు. ఈ పరిస్థితులకు కారణాల నేమం ఉన్నప్పటికీ ప్రధానంగా లబ్ధిదారులు ముందుకు రావడం లేదని, వచ్చిన వారికి అధికారుల సహకారం అందడం లేదన్న వాదనలున్నాయి. 1210 ఇండ్లు మంజూరైతే.. ఇప్పటి వరకు 480 ఇండ్లకు మార్కవుట్ ఇచ్చారు. వీటిలోనూ చాలా మంది పనులను మొదలు పెట్టలేదు. పైలట్ ప్రాజెక్టు కింద గుర్తించిన గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే, రెండో దఫాలో మంజూరైన ఇండ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ఇలా ఇందిరమ్మ ఇండ్ల పైలట్ ప్రాజెక్టు అనుకున్న స్థాయిలో ముందుకు వెళ్లడం లేదని బహిరంగంగానే విమర్శలు వెలువడుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుంటే తప్పా లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి లేదు.

ఇండ్లు వద్దంటూ..

ఇందిరమ్మ ఇండ్లు మాకొద్దని జిల్లాలో 80మందికి పైగా అధికారులకు ద్రువపత్రాలు రాసిచ్చారు. ఇల్లు కావాలని ఆశపడినా చివరకు తమకు వద్దని అధికారులకు చెప్పేశారు. ముందు నుంచి ఇండ్ల నిర్మాణాలపై జనం ఆసక్తి చూపడం లేదు. నిబంధనలు కఠినంగా ఉండడంతో చాలా మంది వెనుదిరుగుతున్నారు. అధికార పార్టీ నాయకులు ఇచ్చిన భరోసాతో చాలా మంది ఇండ్లను నిర్మించుకొని అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధనలు సరిపోనందున చాలా మంది ఆశావాహులు నిరుత్సాహానికి గురవుతున్నారు. చాలా వరకు మంజూరు ఉండడం.. మార్కవుట్లకు ముందుకు రాక పోవడం.. అధికారుల ఒత్తిళ్లతో ఎటు తేల్చుకోలేక ఇల్లు మాకొద్దని పత్రాలు రాసిచ్చి వెళ్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటి వరకు పైలట్ ప్రాజెక్టులో 480 మంది మార్కవుట్‌లు వేసుకోగా, 260 మంది బేస్‌మెంట్, మరో 71 మంది రెంటల్ లెవల్, 22 మంది చెత్తు బిల్స్ తీసుకున్నారు.

ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తాం

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచుతాం. పైలట్ ప్రాజెక్టులో ఉన్న గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. నిర్మాణాలను త్వరగా చేపట్టాలని చెబుతున్నాం. కొందరు చేపడుతున్నారు. మరికొందరు ముందుకు రావడం లేదు. దాదాపు 80మంది వరకు తాము నిర్మాణాలు చేసుకోలేమని పత్రాలను ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పేద ప్రజలు ఉపయోగించుకోవాలి. నిబంధనల ప్రకారం నిర్మాణం చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. గతంలో సిబ్బంది కొరత కూడా ఉండేది. ప్రస్తుతం కొత్త ఏఈలు రావడం వల్ల మా వైపు నుంచి ఎలాంటి సమస్య లేకుండా పనిచేస్తాం.

– విరోబా, డీఈ, జిల్లా హౌసింగ్ శాఖ, వనపర్తి

జూరాలకు నిలకడగా వరద



జూరాలలో ప్రస్తుత నీటిమట్టం

గద్వాల, జూన్ 23 : జూరాలకు వరద నిలకడగా కొనసాగుతున్నది. సోమవారం ఇన్‌ఫ్లో 45,000 క్యూసెక్కులు నమోదు కాగా మూడు గేట్లు ఎత్తి 12,246 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా విద్యుత్ ఉత్పత్తికి 36,430, భీమాలిఫ్ట్–1కు 650, భీమా–2కు 750, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 315, జూరాల ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 500, ఆర్డీఎస్ లింక్ కెనాలకు 150, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా మొత్తం అవుట్ ఫ్లో 51,957 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.8710 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

అయిజ, జూన్ 23 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. సోమవారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 21,950 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 194 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠ నీటిమట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1614.09 అడుగుల నీటిమట్టం ఉన్నది. అదేవిధంగా 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 46.290 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 290 క్యూసెక్కులు కొనసాగుతుండగా, సుంకేసులకు 185 క్యూసెక్కులు విడుదలు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం వండని నిర్వాహకులు

- మోడల్ స్కూల్‌లో రెండు రోజులుగా విద్యార్థులకు వండిపెడుతున్న టీచర్లు

వెల్దండ, జూన్ 23 : ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్, వంట నిర్వాహకుల మధ్య సమన్వయ లోపం విద్యార్థులను పస్తులుంచే పరిస్థితికి తీసుకువచ్చింది. వివరాలోకి వెళితే.. వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో శనివారం, సోమవారం రెండు రోజులుగా వంట నిర్వాహకులు మధ్యాహ్న భోజనం వండడం లేదు. దీంతో ఉపాధ్యాయులు, అటెండర్ కలిసి వంట చేసి విద్యార్థులకు పెడుతున్నారు. దీనిపై వంట నిర్వాహకులను వివరణ అడగగా ప్రతి సారి చేసిన వంట బాగా లేదని రోడ్డుపై పారబోస్తారని ప్రిన్సిపాల్ కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. విద్యార్థులకు వంట చేయడాన్ని వదిలిపెట్టి పాఠశాలలో గడ్డి పీకమంటున్నారని, ప్రిన్సిపాల్, మరో ఉపాధ్యాయులాలు తమను తీవ్రంగా టార్చర్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 13 ఏండ్ల నుంచి వంట చేస్తున్న నిర్వాహకులు అకస్మాత్తుగా బంద్ చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని, వారిని కించపరిచే విధంగా ప్రిన్సిపాల్ మాట్లాడటం ఏంటని.. వీరి వల్ల మధ్యలో విద్యార్థులు పస్తులుండాల్సి వస్తుందని ఉన్న తాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట టంకర గ్రామస్తుల నిరసన

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన టంకర గ్రామస్తులు

- కలెక్టరేట్ ఎదుట టంకర గ్రామస్తుల నిరసన
- ఐదోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉపాధ్యాయులను నియమించండి

హన్వాడ, జూన్ 23 : హన్వాడ మండలం టంకర జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను నియమించి మెరుగైన విద్యను అందించాలని టంకర గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంకర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 230మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారని, విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో వారి చదువులు ముందుకు సాగేదెలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, మెరుగైన విద్యను అందిస్తామని ప్రచారం చేస్తున్నా ఆచరణలో అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు కల్పించకుండా, కనీసం ఉపాధ్యాయులను కూడా విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు నియమించక పోతే మా పిల్లలను పాఠశాలలకు పంపి ప్రయోజనం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో హిందీ, సోషల్, సైన్స్‌తోపాటు మరి కొన్ని సబ్జెక్టులకు కూడా ఉపాధ్యాయులు లేరన్నారు. ఉపాధ్యాయులను నియమించాలని ఇప్పటికే నాలుగు సార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశామని అయినా స్పందించకపోవడంతో మరోసారి కలెక్టరేట్‌కు వచ్చినట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టంకర పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా రెండు రోజుల్లో పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని, అలాగే నేను వచ్చి పాఠశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోయిని శ్రీనివాసులు, జహంగీర్, కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను, వెంకటయ్య, అంజి, తిరుపతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో 'పేట-కొడంగల్' భూ సేకరణ

ఊట్కూర్, జూన్ 23 : నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా పోలీస్ పహారాలో అధికారులు భూసేకరణ సర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం ఊట్కూర్ మండలంలోని దంతన్‌పల్లి శివారులో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పెద్దచెరువు సాగునీటి సామర్థ్యం పెంచేందుకు శివారు రైతుల పొలాల్లో భూ సేకరణ సర్వే చేపట్టారు. సర్వే సందర్భంగా రైతుల నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో భూ సేకరణ సర్వే పనులు కొనసాగించారు. ఊట్కూర్ పెద్దచెరువు నుంచి బాపురం శివారులో నిర్మించే సంప్ హౌస్ ద్వారా నారాయణపేట మండలం పేరపళ్ల జయమ్మ చెరువుకు సాగునీటిని తరలించే క్రమంలో పెద్ద చెరువు విస్తీర్ణం పెంచడం తోపాటు చెరువు కట్ట నిర్మాణం కోసం దంతన్‌పల్లి శివారు రైతులకు సంబంధించిన సుమారు 96 ఎకరాల వ్యవసాయ భూమికి తాసీల్దార్ రవి ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహణ పూర్తి చేశారు. నారాయణపేట– కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూములు కోల్పోతున్న వారు సన్న, చిన్నకారు రైతులు కావడంతో ఎకరాకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు పరిహారం అందజేయాలని, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు కృష్ణారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోలీస్ పహారా మధ్య సర్వే చేస్తున్న అధికారులు

సాయిచంద్ ఆశయ సాధనకు కృషి

ఆత్మకూర్‌లో సాయిచంద్ విగ్రహావిష్కరణ పోస్టర్లు విడుదల చేస్తున్న రజినీసాయిచంద్

- 29న విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి
- గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్

అమరచింత, జూన్ 23 : అమరచింత ముద్దుబిడ్డ, తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ ఆశయ సాధనకు కృషి చేద్దామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఆత్మకూర్, అమరచింత మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి సాయిచంద్ రెండో వర్ధంతికి సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 29న అమరచింతలో సాయిచంద్ విగ్రహాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన కళాకారులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆత్మకూర్, అమరచింత మండలాల అధ్యక్షుడు రవికుమార్, రమేశ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, రేచింతల పీఏసీసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, నాయకులు నరసింహులు గౌడ్, లెనిన్ తోపాటు సాయిచంద్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డును నిలిపివేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న గట్టుయాదవ్

వనపర్తి, జూన్ 23(నమస్తే తెలంగాణ) : వనపర్తికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన బైపాస్ రోడ్డును కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో వనపర్తి జిల్లా కేంద్రానికి పాన్‌గల్ రోడ్డు నుంచి కొత్త కోట రోడ్డు వరకు బైపాస్ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జీవో 366 ద్వారా రూ.73 కోట్లను మంజూరు చేయించి టెండర్లను కూడా ఏర్పాటు చేయించినా పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. సోమవారం మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గట్టుయాదవ్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డుకు టెండర్లు పూర్తి చేసి కొంత ఫార్మెషన్ పనులు కూడా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఆ పనులను పూర్తిగా నిలిపివేసిందన్నారు. ఇటీవలే గతంలో బైపాస్ రోడ్డు కోసం నిర్ణయించిన స్థలంలో ప్రస్తుతం మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారని, దీనివల్ల బైపాస్ రోడ్డును పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అర్థమవుతున్నదన్నారు. బైపాస్ రోడ్డు మార్గం ద్వారా గతంలో టీడీపీలో ఉండి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న నాయకుడికి చెందిన నాలుగు ఎకరాల పొలం రోడ్డులో పోతుందని, ఈ నాయకుడికి మేలు చేయడం కోసం బైపాస్ రోడ్డును కొనసాగనీయకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నట్లు ఆరోపించారు. వనపర్తి చరిత్రలో విప్లవాత్మకంగా అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తే, వాటిని అమలు చేసే పరిస్థితి కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదన్నారు. నిరంజన్ రెడ్డికి మంచి పేరు వస్తుందని, గతంలో మంజూరైన పనులన్నింటినీ పక్కకు పెట్టారని విమర్శించారు. నిధులు ఉండి టెండర్ పూర్తయిన రింగ్ రోడ్డును ఓ నాయకుడి ప్రయోజనం కోసం ఆపుతారా అంటూ ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి సమాధానం చెప్పాలని, వెంటనే బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించకపోతే.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని గట్టుయాదవ్ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమళ్ల అశోక్, నందిమళ్ల రమేశ్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.